క్లుప్తంగా

నేడు బేతవోలులో మండల స్థాయి క్రీడాపోటీలు

చిలుకూరు: బేతవోలు జిల్లా పరిషత్‌ పాఠశాలలో సోమవారం మండల స్థాయి స్కూల్‌ గేమ్స్‌ నిర్వహించనున్నట్లు ఎంఈఓ గురవయ్య ఆదివారం తెలిపారు. బాలురు, బాలికలకు అండర్‌ – 14, 17 విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పెండింగ్‌ ఉపాధి బిల్లులు విడుదల చేయాలి

నడిగూడెం : పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బిల్లులు విడుదల చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్‌ మల్లెల వెంకన్న ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గత వేసవిలో చేసిన పనులు మూడు నెలలు పూర్తయినా నేటికీ బిల్లులు విడుదల చేయలేదన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన బిల్లులు తక్షణమే విడుదల చేయాలని కోరారు.

రహదారికి మరమ్మతులు చేయాలి

నడిగూడెం : నడిగూడెం నుంచి చాకిరాలకు వెళ్లే రహదారికి మరమ్మతులు చేయాలని సామాజిక కార్యకర్త గంటెపంగు నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానికంగా ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నదని, ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

చంద్రగ్రహణంతో దేవాలయాలు మూసివేత

చిలుకూరు: చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం చిలుకూరు మండల పరిధిలోని పురాతన దేవాలయాలు మూసివేశారు. చిలుకూరు చెన్నకేశవ ఆలయం, కోదండ రామాలయం, అభయాంజనేయ స్వామి దేవాలయం, బేతవోలులో కనకదుర్గమ్మ, రామాలయం, శివాలయంతోపాటు పలు దేవాలయాలు ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం ఉదయం 10 గంటల వరకు మూసి వేస్తున్నట్లు ఆలయ పూజారులు అనంతకృష్ణామాచార్యులు, లక్ష్మప్ప, రజినికాంత్‌, వేణుగోపాలాచార్యులు తెలిపారు.

లైట్‌ మోటార్‌ వర్కర్స్‌ యూనియన్‌ ఎన్నిక



సమావేశమైన యూనియన్‌ సభ్యులు

హుజూర్‌నగర్‌ : హుజూర్‌నగర్‌ లైట్‌ మోటార్‌ వర్కర్స్‌ యూనియన్‌ సమావేశం ఆదివారం హుజూర్‌నగర్‌ పట్టణంలో నిర్వహించారు. ఈసందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌, కార్యదర్శిగా సైదులు, సహాయ కార్యదర్శిగా ముస్తఫా, కోశాధికారి వెంకటేష్‌, కార్యవర్గ సభ్యులుగా సునీల్‌, గౌస్‌, సైదారావు, గోపి, వీరాంజనేయులు, నరసింహ, నగేష్‌లను ఎన్నుకున్నారు.

నిత్యావసర సరుకుల అందజేత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల పట్టణంలో నిరుపేద ఆర్యవైశ్య కుటుంబానికి చెందిన జగిని శ్రీనివాస్‌ ఇటీవల ప్రమాదానికి గురయ్యాడు. కాలు విరగడంతో చికిత్స పొందుతున్నాడు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దాతల నుంచి సేకరించిన రూ.43 వేలతో పాటు ఏర్పాటు చేసిన నిత్యావసర సరుకులను ఆదివారం ఆయన కుటుంబానికి అందించారు. వారిలో సంఘం నాయకులు రాచకొండ శ్రీనివాస్‌, నటరాజ్‌, కొత్త లక్ష్మణ్‌, పోలిశెట్టి వెంకటేశ్వర్లు, పుల్లయ్య, నాగేశ్వర్‌రరావు, కోటేశ్వర్‌రావు, సైదయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్‌ తదితరులున్నారు.

నేడు గోదావరి జలాల విడుదల

అర్వపల్లి : మండే ఎండలతో వరి పొలాలు ఎక్కడికక్కడ ఎండిపోతుండటం.. గోదావరి జలాలు విడుదల కాకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై సాక్షిలో ఆదివారం జాడలేని గోదావరి జలాలు అనే శీర్షికన కథనం ప్రచురితం కాగా నీటిపారుదల శాఖ అధికారులు స్పందించారు. ఎట్టకేలకు సోమవారం ఉదయం 11గంటలకు జనగామ జిల్లా బయ్యన్నవాగు నుంచి సూర్యాపేట జిల్లాకు గోదావరి జలాలను విడుదల చేయాలని నిర్ణయించారు. వారబందీ విధానంలో నీటిని సాగుకు విడుదల చేస్తామని నీటిపారుదలశాఖ ఈఈ సత్యనారాయణగౌడ్‌ తెలిపారు. రైతులు కాలువలకు నష్టం కలిగించకుండా అడ్డు కట్టలు వేయకుండా నీటిని పంటలకు వాడుకోవాలని కోరారు. వర్షాకాలం పంటలు చేతికొచ్చే వరకు నీటిని ఇస్తామని పేర్కొన్నారు.

అధ్వానంగా తాడువాయి- నేలమర్రి రోడ్డు

మునగాల: మండలంలో జాతీయ రహదారిపై తాడువాయి స్టేజి నుంచి నేలమర్రి వరకు గల 8 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రహదారి గుంతలమయంగా మారింది. రహదారిపై వెంకట్రాంపురం, తాడువాయి, తాడువాయి తండా ప్రజలు నిత్యం మండల కేంద్రంతో పాటు కోదాడ, సూర్యాపేటకు వెళ్తుంటారు. వర్షం వస్తే ఈ గుంతలరోడ్డులో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని మూడు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.





గుంతలమయంగా మారిన జాతీయ రహదారి నుంచి తాడువాయి వెళ్లే రోడ్డు

రోడ్డు తవ్వారు.. పూడ్చడం మరిచారు

మోతె: గత పది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు మోతె మండల పరిధిలోని కాసిగూడెం గ్రామంలో ఇళ్లలోకి వరద నీరు చేరింది. నీరు బయటకు వెళ్లేందుకు వేరే దారి లేక ఇళ్ల పక్కన ఉన్న సిరికొండ–రావిపహాడ్‌ గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్డును తహసీల్దార్‌, సిరికొండ పంచాయతీ కార్యదర్శి తవ్వించి వరద నీటిని కాల్వ ద్వారా పొలాల్లోకి పంపించారు. తవ్విన రోడ్డును ప్రస్తుతం పూడ్చకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి తవ్విన రోడ్డును పూడ్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కాసిగూడెం గ్రామంలో రోడ్డు తవ్వి వదిలేసిన దృశ్యం

ఆత్మజ్ఞానంతోనే జీవితంలో ప్రశాంతత

హుజూర్‌నగర్‌ : ఆత్మజ్ఞానంతో జీవితంలో సుఖసంతోషాలు, ప్రశాంతత లభిస్తుందని ని ఇస్కాన్‌ మందిరం ప్రవచన వక్త, భగవద్గీత ప్రచారకులు ప్రభూజీ హృషికేశ దాస్‌ అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి సత్రంలో భగవద్గీత సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవద్గీత జ్ఞానం మనల్ని లౌకికమైన చింత, భ్రాంతి, దుఃఖముల నుంచి అలౌకికమైన చింతన, సత్యం సుఖం వైపునకు తీసుకెళ్తుందన్నారు. ప్రసాదం పంపిణీకి సహకరించిన తొనుపునూరి విజయలక్ష్మీ శేఖర్‌ లను శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో శ్రీమన్నారాయణ, నాగేశ్వరరావు, రాధాకృష్ణ, నాని, శీను, వెంకటలక్ష్మి, శ్రీను, సతీష్‌, వెంకట్‌ నారాయణ, గోపీచంద్‌, చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న భగవద్గీత ప్రచారకులు ప్రభూజీ హృషికేశ దాస్‌

యూనియన్‌ పోరాట ఫలితమే ఇన్సూరెన్స్‌పై జీఎస్టీ రద్దు



మాట్లాడుతున్న సంఘం డివిజన్‌ కార్యదర్శి రఘు

కోదాదరూరల్‌: ఆల్‌ ఇండియా ఇన్సూరెన్స్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ పోరాట ఫలితంగానే కేంద్రం వ్యక్తిగత, ఆరోగ్య బీమాలపై జీఎస్టీ రద్దు చేసిందని ఆ సంఘ డివిజన్‌ కార్యదర్శి రఘు అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని ఎల్‌ఐసీ కార్యాలయంలో నిర్వహించిన సూర్యాపేట, కోదాడ బ్రాంచ్‌ల యూనియన్‌ సంయుక్త సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థలో నూతన ఉద్యోగుల నియమాకాలను వెంటనే చేపట్టడంతో పాటీ 1996 బ్యాచ్‌ ఉద్యోగులకు పాత పెన్షన్‌ విధానాన్ని పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.బాలస్వామి, డివిజన్‌నాయకులు జావిద్‌, సూర్యాపేట బ్రాంచ్‌ అధ్యక్ష, కార్యదర్శులు విజయశంకర్‌కన్నయ్య, మోషన్‌సింగ్‌, ప్రభాకర్‌, సువర్ణ, రాణి, ఉపేందర్‌, శ్రీనివాస్‌ తదితరులు ఉన్నారు.

యూరియా అందించాలి

గరిడేపల్లి: రైతాంగానికి యూరియా అందించి అధిక ధరలను నియంత్రించాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్‌ యాకూబ్‌అన్నారు. ఆదివారం గరిడేపల్లి మండల కేంద్రంలోని ఎమ్మెస్‌ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయానికి సరిపడా యూరియా అంచనా వేయడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. అధిక ధరలను నియంత్రించాలని, లేకుంటే ఎర్రజెండా ఆధ్వర్యంలో ప్రత్యక్ష పోరాటాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో వీరస్వామి, బంగారమ్మ, సైదమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి

జర్నలిస్టులకు సన్మానం

నేరేడుచర్ల : జిల్లా ఆర్యవైశ్య సంఘం పిలుపు మేరకు ఆదివారం నేరేడుచర్లలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జర్నలిస్టు డే నిర్వహించారు. స్థానిక జర్నలిస్టులు టీఎస్‌ స్వామి,, దొంతిరెడ్డి కరుణాకర్‌రరెడ్డి, చామకూరి వీరయ్య, ఆలక సైదిరెడ్డి, బుడిగ శంకర్‌, యూగేందర్‌, రవీందర్‌, రామకృష్ణ, సైదులు, పుల్లారావు, బాలకృష్ణ, సోమేశ్వర్‌ గౌడ్‌, సైదులు, సతీష్‌, వెంకట్రావ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాచకొండ శ్రీనివాస్‌రావు, కందిబండ శ్రీనివాస్‌రావు, పోల విశ్వనాథం, లక్ష్మణ్‌, వెంకటేశ్వర్లు, నటరాజ్‌, అంజయ్య, అశోక్‌, లక్ష్మీనర్సింహరావు, రమేష్‌, పుల్లయ్య, శ్రీను, పరమేశం, రాము, రామ్మూర్తి, కిషన్‌, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

ప్రజలు గర్వించదగ్గ నేత రావి నారాయణరెడ్డి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

సూర్యాపేట అర్బన్‌ : ప్రజలు గర్వించదగ్గ నాయకుడు రావి నారాయణ రెడ్డి అని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని ధర్మ భిక్షం భవన్‌లో సీపీఐ జిల్లా కౌన్సిల్‌ ఆధ్వర్యంలో ఆదివారం రావి నారాయణరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర కమిటీ సభ్యుడు ధూళిపాల ధనుంజయ నాయుడు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కౌన్సిల్‌ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యల్లావుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్‌, మండవ వెంకటేశ్వర్లు, ఎల్లావుల యాదగిరి, బద్దం కృష్ణారెడ్డి, మేకల శ్రీనివాస్‌, అనంతల మల్లేశ్వరి, డి.మల్లేశ్వరి, ఎస్‌కే లతు, బూర వెంకటేశ్వర్లు, కోటమ్మ, శ్రీనివాస్‌, రేమిడాల రాజు, ప్రభాకర్‌, లక్ష్మి, కొండలు, తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ జయంతిని విజయవంతం చేయాలి

సూర్యాపేట అర్బన్‌ : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనుంజయ నాయుడు అన్నారు. సూర్యాపేట పట్టణంలోని బీసీ హక్కుల సాధన సమితి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాటి తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాల స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రానున్న పార్లమెంట్‌ ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్‌ సాధించుకునే దిశగా ఉద్యమాలు కొనసాగించాలని అన్నారు. ఈ సమావేశంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లుట్ల కనకయ్య, నాయకులు బూర వెంకటేశ్వర్లు, జడ శ్రీనివాస్‌ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధనుంజయ నాయుడు

పోషకాహార పదార్థాల ప్రదర్శన

సూర్యాపేటటౌన్‌: పట్టణంలోని భవానీ కాలేజ్‌ ఆఫ్‌ నర్సింగ్‌ కళాశాల విద్యార్థులకు ఆదివారం పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోజువారీ జీవితంలో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, సమతుల ఆహారం ప్రాముఖ్యతను కళాశాల యాజమాన్యం విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తయారుచేసిన చికెన్‌, పండ్లు, జొన్న రోటీ, రవ్వ కేసరి ప్రదర్శించారు.

శిథిలావస్థలో మంచినీటి ట్యాంకు

నడిగూడెం : మండల కేంద్రంలోని బస్టాండ్‌ సెంటరులో 20 ఏళ్ల కిందట నిర్మించిన మినీ మంచినీటి ట్యాంకు శిథిలావస్థకు చేరింది. ట్యాంకు దెబ్బతినడంతో తాగు నీరు లీకేజీ అవుతోంది. బస్టాండ్‌ చుట్టుపక్కల వీధులకు చెందిన అనేక మంది ప్రజలు తాగు నీటికోసం ఈ ట్యాంకు వద్దకే వస్తుంటారు. అదేవిధంగా నడిగూడేనికి వచ్చే వివిధ గ్రామాలకు వచ్చే ప్రజలు ఈ ట్యాంకు తాగు నీటినే తాగుతుంటారు. ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో తాగు నీరు కలుషితమవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. పాత కాలం నాటి ట్యాంకును తొలగించి, కొత్తగా నిర్మించాలని కోరుతున్నారు.



ఆదరణ కరువైన శివాలయం

- శిథిలావస్థకు చేరిన శాతావాహన కాలంలో నిర్మించిన ఆలయం

మునగాల: మండలంలోని తాడువాయి గ్రామపంచాయతీ పరిధిలో శాతవాహనుల కాలంలో నిర్మించిన శ్రీభ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయానికి ఆదరణ కరువైంది. గతంలో ఈ శివాలయానికి ఎంతో చరిత్ర ఉండగా నేడు శిథిలావస్థకు చేరింది. దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ దేవాలయానికి ఎలాంటి ఆదాయం లేదు. కేవలం అర్చకుడు మాత్రమే ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తున్నాడు. సోమవారాలు, పర్వదినాలు, మహాశివరాత్రి వేడుకల సమయంలో ఈ ఆలయానికి పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు వస్తుంటారు. మహాశివ రాత్రి సమయంలో ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి పలువురు భక్తులు ప్రత్యేకంగా ఈ ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహిస్తుంటారు. గ్రామంలో పురాతన శివాలయాన్ని పునర్నిర్మించేందుకుగాను గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కోల ఉపేందర్‌రావు ఇటీవల ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రాజకీయాలకతీతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం దేవాలయం ఆవరణలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.



తాడువాయిలో శిథిలావస్థలో ఉన్న శివాలయం

ప్రహరీ లేక విషపురుగులు వస్తున్నాయి



ఎంతో ఘనచరిత్ర కల్గిన శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవాలయానికి ఆదరణ కరువైంది. నేను 25ఏళ్లుగా ఆలయ అర్చకుడిగా కొనసాగుతున్నా. రేకుల షెడ్డులో ఉన్న ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. చుట్టూ ప్రహరీ లేకపోవడంతో విషపురుగులు, పాములు దేవాలయంలోకి వస్తున్నాయి. ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు ముందుకు రావాలి.

– వారణాసి సత్యనారాయణ శాస్త్రి, దేవాలయ అర్చకులు, తాడువాయి

ఆలయ పునర్నిర్మాణానికి ముందుకు రావాలి



గ్రామంలో ఉన్న శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవాలయం ఆదరణ కరువై శిథిలావస్థకు చేరుకొని కూలేందుకు సిద్ధంగా ఉంది. ఆలయాన్ని పునర్నిర్మించి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు రాజకీయాలు, కులమతాలకతీతంగా ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, గ్రామప్రజలు, భక్తులు ముందుకు రావాలి.

– కోల ఉపేందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, తాడువాయి

విశ్వకర్మ స్ఫూర్తి లెజెండరీ పురస్కారానికి ఎంపిక

హుజూర్‌నగర్‌ : హుజూర్‌నగర్‌కు చెందిన చేపూరి నరసింహచారి విశ్వకర్మ స్ఫూర్తి లెజెండరీ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. సెప్టెంబర్‌ 17న విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ విరాట్‌ విశ్వకర్మ విజ్ఞాన ఆధునిక ధార్మిక కళాపరిషత్‌, జాతీయ సాహితీ సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ, తెలుగు ఇండియన్‌ కల్చరల్‌ బుక్‌ ఆఫ్‌ వరల్డ్‌ రికార్డ్స్‌ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో కృషి చేసిన వారిని ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈనెల 14న సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని శ్రీరాజ్యలక్ష్మి కన్వెన్షన్‌ హాల్‌లో ఈ పురస్కారాన్ని అందుకోనున్నట్లు నరసింహచారి తెలిపారు.



నరసింహచారి

కానిస్టేబుల్‌పై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి



గాయపడిన కానిస్టేబుల్‌ను పరామర్శిస్తున్న గౌడ ఉద్యోగ సంఘం నాయకులు

కోదాడరూరల్‌ : విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌ ఓరుంగటి నరేష్‌గౌడ్‌పై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డివిజన్‌ గౌడ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మండవ ఉపేందర్‌ డిమాండ్‌ చేశారు. వినాయక శోభాయాత్రలో అల్లరిమూకల దాడిలో గాయపడిన నరేష్‌గౌడ్‌ను గౌడ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆస్పత్రిలో పరామర్శించారు. వారిలో కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యర్శి శ్రీనివాసరావు తదితరులున్నారు.

మేరీమాత జన్మదిన వేడుకలు



మేరీమాత జన్మదిన వేడుకల్లో క్రైస్తవులు

హుజూర్‌నగర్‌ : హుజూర్‌నగర్‌లోని సెయింట్‌ జోసెఫ్‌ చర్చిలో ఆదివారం మేరీ మాత జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా క్యాథలిక్‌ విశ్వాసులు కొవ్వొత్తులు, పూలమాలతో మేరీమాతను ఆరాధించారు. కార్యక్రమంలో ఫాదర్‌ సాగర్‌ రాజు, సిస్టర్స్‌ అనిత, సుందరి, పుష్ప, బాల సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

మోతె: మండల పరిధిలోని రాఘవాపురం ఎక్స్‌రోడ్డులో సీనియర్‌ న్యాయవాది పొదిల్ల ప్రదీప్‌కుమార్‌ తల్లిగారు అనసూయమ్మ వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆదివారం గ్రామానికి చేరుకొని ప్రదీప్‌కుమార్‌ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట అనసూయమ్మ కుమారులు పొదిల్ల ప్రదీప్‌కుమార్‌, పొదిల్ల రవీందర్‌, జెడ్పీ మాజీ వైస్‌ చైర్మన్‌ గోపగాని వెంకటరమణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్‌, సీనియర్‌ అడ్వకేట్‌ రామారావు, పెన్‌పహాడ్‌ బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు నెమ్మాది భిక్షం, ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మధుసూదన్‌రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.



ప్రదీప్‌కుమార్‌ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

జీఎస్టీ స్లాబ్‌ రేట్ల తగ్గింపుతో పేదలకు ఊరట

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి

నేరేడుచర్ల : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబ్‌ రేట్లు తగ్గించడం నిరుపేదలకు ఊరట కలిగించిందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి అన్నారు. ఆదివారం నేరేడుచర్లలోని ప్రధాన కూడల్లో బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నేరేడుచర్ల పట్టణ అధ్యక్షులు కొణతం నాగిరెడ్డి, చింతకుంట్ల రాజేష్‌రెడ్డి, గరిడేపల్లి, పాలకీడు మండల అధ్యక్షులు కుక్కడపు వెంకటేశ్వర్లు, రమావత్‌ నరినాయక్‌, జిల్లా కౌన్సిల్‌ సభ్యులు సంకలమద్ది సత్యనారాయణ, గుండ్రెడ్డి భాస్కర్‌రెడ్డి, ప్రార్థనబోయిన విజయ్‌కుమార్‌, బాల వెంకటేశ్వర్లు, తాళ్ల నరేందర్‌రెడ్డి, శేషగిరిరావు, అశోక్‌, శంకర్‌రెడ్డి, నాగయ్య,, శ్రీనివాస్‌రెడ్డి, రామినేని కృష్ణయ్య, శ్రీనివాస్‌, చంద్రశేఖర్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, రమేష్‌నాయుడు, రామ్మూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, రాజునాయక్‌, రాము, విమల, కృష్ణవేణి, రాంరెడ్డి, సందీప్‌, సైదులు, నాగ సైదులు, లక్ష్మణ్‌నాయక్‌,. సింధూజ, నాగేశ్వర్‌రావు, మగతానాయక్‌, విద్యాసాగర్‌, నాగేశ్వర్‌రావు తదితరులున్నారు.



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి

విద్యార్థులకు తైక్వాండో గ్రేడింగ్‌ టెస్ట్‌



గ్రేడింగ్‌ టెస్ట్‌లో బెల్టులు పొందిన విద్యార్థులతో తైక్వాండో నల్లగొండ జిల్లా కార్యదర్శి అనిల్‌ కుమార్‌

హుజూర్‌నగర్‌ : తెలంగాణ స్టేట్‌ టైక్వాండో అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఆదివారం హుజూర్‌ నగర్‌లో విద్యార్థులకు తైక్వాండో కలర్‌ బెల్ట్‌ గ్రేడింగ్‌ టెస్ట్‌ నిర్వహించారు. తైక్వాండో నల్లగొండ జిల్లా కార్యదర్శి చింత అనిల్‌ కుమార్‌ పర్యవేక్షణలో విద్యార్థులు ఈ బెల్టులు సాధించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌ అంబేద్కర్‌, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ నూతన చైర్మన్‌గా మల్‌రెడ్డి నర్సింహారెడ్డి

మేళ్లచెరువు : మేళ్లచెరువు ప్రాథమిక సహకార సంఘం చైర్మన్‌గా వేపలమాధవరం గ్రామానికి చెందిన మల్‌రెడ్డి నర్సింహారెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఈఓ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. చైర్మన్‌ శంబిరెడ్డిని తొలగించి ఆయన స్థానంలో నూతన చైర్మన్‌గా నర్సింహారెడ్డిని నియమించినట్లు తెలిపారు.

నాటుకోళ్లతో స్వయం ఉపాధి

- ప్రత్యేకంగా షెడ్డు ఏర్పాటు చేసి సుమారు 300 కోళ్లను పెంచుతున్న రైతు

మోతె: స్వయం ఉపాధికి ఎన్నో మార్గాలు ఉన్నాయి. ప్రధానంగా యువత, మహిళలు స్వయం ఉపాధి పనులు చేసుకుంటూ జీవితంలో రాణిస్తుంటారు. మోతె మండల పరిధిలోని రావిపహాడ్‌ గ్రామానికి చెందిన బాలగాని లింగయ్య అంగవైకల్యం కల్గి ఉన్నా తనకున్న 5 ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ అర ఎకరంలో నాటు కోళ్ల పెంపకం కోసం షెడ్డు ఏర్పాటు చేసి సుమారు 300 కోళ్లను పెంచుతున్నాడు.

రెండింతల లాభం

బాలగాని లింగయ్య కోడి పిల్లలను భువనగిరి, చౌటుప్పల్‌ పరిసర ప్రాంతాల్లో రూ. 50–60 ధరకు కొనుగోలు చేస్తాడు. రోజు వారిగా దాణా, నీటి వసరు కల్పిస్తూ, కొంచం పెద్దయ్యాక బయట తిరిగేందుకు షెడ్‌ నుంచి వదులుతాడు. కోడి పిల్లలు అనారోగ్యం బారిన పడకుండా 14 రోజుల వయస్సులో వ్యాక్సిన్‌, 21 రోజుల వయస్సులో మరోసారి వ్యాక్సిన్‌ వేపిస్తాడు. సుమారుగా 5 నెలలు తర్వాత కిలో బరువు నుంచి 2 కిలోల వరకు బరువు పెరుగుతాయి. సీజన్‌ బట్టి కేజీ రూ.350 నుంచి 400 వరకు విక్రయిస్తున్నాడు. సంవత్సరంలో రెండు సార్లు విక్రయిస్తున్నాడు. కొన్నింటిని సూర్యాపేటలో అమ్ముతున్నాడు. పెట్టుబడి ఖర్చులు పోనూ రెండింతల లాభం వస్తున్నట్లు లింగయ్య తెలిపాడు.



ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నాటు కోళ్ల షెడ్డు

వ్యవసాయం చేస్తూనే కోళ్ల పెంపకం

ఒక వైపు వ్యవసాయం చేస్తూనే నాటు కోళ్లను పెంచుతున్నాను. సాధారణ టార్పాలిన్లతో కోళ్ల షెడ్డు నిర్మించాను. మొదట కొన్ని ఇబ్బందులు వచ్చినా ప్రస్తుతం 300 కోడి పిల్లలను పెంచుతున్నా. ఇప్పుడిప్పుడే ఆర్థికంగా బలపడుతున్నాను.

– బాలగాని లింగయ్య